సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం, 20, సెప్టెంబర్, 2024



కుర్చీ.. భర్తీ ఎప్పుడో?

జడ్చర్ల మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గగా.. ఇప్పటికీ స్థానం భర్తీ చేయలేదు.

వివరాలు 8లో ▸



చిన్నచూపు చూస్తే సహించం

ఎస్సీ, ఎస్టీలను చిన్నచూపు చూస్తే సహించమని కమిషన్ చైర్మన్ వెంకటయ్య అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /21.3

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

21న ధ్రువపత్రాల పరిశీలన

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది కోసం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల మెరిట్ జాబితాను ఈ నెల 21న విడుదల చేయడంతోపాటు ధ్రువపత్రాలను విడుదల చేయనున్నట్లు డీఈఓ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది పరీక్ష రాసిన అభ్యర్థులు 1:3 ప్రకారం ఎంపికైన వారి వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. జిల్లాలోని ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 23 పోస్టులు, 20 కేజీబీవీల్లో 41 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సబ్జెక్టుల వారీగా సీఆర్‌టీలు, పీఈటీల వారిగా ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు పరీక్ష రాశారన్నారు.

‘క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి’



తెలకపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం దశల వారిగా కృషిచేస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధంగా చదవాలని, చదువులో ముందుంటూ క్రీడలతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. పాఠశాలలోని తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధంగా విని ఇష్టంతో చదవాలన్నారు. అదే పట్టుదలతో అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీడా పోటీల్లో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సుఖజీవన్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ యాదయ్య, అన్ని పాఠశాలల పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుపై నిర్లక్ష్యం


ఇంకా వరద నీటిలోనే వట్టెం పంప్‌హౌజ్



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ వట్టెం పంప్‌హౌజ్‌లో ఇంకా నీటిలోనే ఉన్న మోటార్లు

- ముందస్తు జాగ్రత్తలు పాటించకపోవడంపై విమర్శలు
- మోటార్ల వెలికితీతకు నెల రోజుల సమయం
- ఊసే లేని ‘పాలమూరు-రంగారెడ్డి’ ప్రాజెక్ట్ కాల్వల నిర్మాణ పనులు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులపై పర్యవేక్షణ కరువైంది. దాదాపు ఏడాది కాలంగా ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కనీస నిర్వహణ పనులు కూడా చేపట్టకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పరిధిలోని వట్టెం వద్ద చేపట్టిన పంప్‌హౌజ్‌లోని మోటార్లు ఈ నెల 2వ తేదీన వరద నీటిలో మునిగాయి. 17 రోజులు దాటినా ఇంకా మోటార్లు నీటిలోనే ఉన్నాయి. పంప్‌హౌస్‌లోని నీటిని పూర్తిగా తోడి మోటార్లను బయటకు తీస్తేనే వాటి పనితీరు, సామర్థ్యాన్ని అంచనా వేయగలమని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.



నార్లాపూర్ వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ డెలివరీ సిస్టర్న్ పనులు

నిధులు లేక మూలనపడ్డ ప్రాజెక్ట్ పనులు..

పాలమూరు ప్రాజెక్ట్ పనులు గతేడాది డిసెంబర్ నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. టన్నెళ్లు, నిర్మాణ పనులు నిలిచిపోగా, కేవలం మోటార్ల బిగింపు పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసేందుకు ఇంకా సుమారు రూ.20వేల కోట్ల వరకు అవసరమని అంచనా. అయితే గత బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ పనుల కోసం కేవలం రూ.1,285 కోట్లను మాత్రమే కేటాయించింది. ఇప్పటివరకు నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన రిజర్వాయర్లు పూర్తికా వచ్చాయి. కానీ వీటిని అనుసంధానం చేసే టన్నెళ్లు, కాల్వల నిర్మాణం పూర్తికాలేదు. నార్లాపూర్ నుంచి ఏదుల వరకు సుమారు 600 మీటర్లకు పైగా టన్నెల్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఇటీవల వర్షాలతో నీటమునిగిన మోటార్లను వెలికితీసేందుకు డీ వాటరింగ్ చేపట్టాం. ఇప్పటివరకు మూడు మీటర్ల మేరకు నీటిని తొలగించాం. త్వరగా నీటిని తొలగించి, మోటార్లను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే డిసెంబర్ నాటికి మోటార్లను సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– పార్థసారథి, నీటిపారుదల శాఖ ఈఈ

ఊసేలేని కాల్వల భూసేకరణ..

ఎత్తిపోతల పథకం పరిధిలోని రిజర్వాయర్ల నిర్మాణం పూర్తికావచ్చినా ప్రధానంగా కాల్వలను నిర్మిస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రిజర్వాయర్లలోని నీటిని రైతుల పంట పొలాలకు మళ్లించేందుకు ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ కాల్వలు, పంట కాల్వలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కాల్వల నిర్మాణం కోసం ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియనే ముందుకు సాగడం లేదు. కాల్వల తవ్వకాల కోసం భూసేకరణ ప్రక్రియ ప్రధాన సమస్యగా మారింది. ఇందుకోసం రూ. కోట్లలో నిధులను వెచ్చించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఊసే లేకుండాపోయింది. ఇందుకోసం చేపట్టాల్సిన టెండర్ల ప్రక్రియ సైతం ముందుకు సాగకపోవడంతో ప్రాజెక్ట్ పురోగతిపై సందిగ్ధం నెలకొంది.

నిర్లక్ష్యంతోనే మునిగిన మోటార్లు..

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద వట్టెం రిజర్వాయర్ వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌లో ఇప్పటివరకు నాలుగు మోటార్లు బిగించారు. అయితే వరద నీరు పంప్‌హౌస్‌లోకి చేరి మోటార్లు నీటమునిగిన ఘటనలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు చేపట్టకపోవడంతోనే ఇలా జరిగినట్లు తెలుస్తోంది. ప్రాజెక్ట్ పనుల నిర్వహణ కోసం ఆరుచోట్ల ఆడిట్ టన్నెళ్లను ఏర్పాటు చేశారు. నిర్మాణ సమయంలో మట్టి, బండరాళ్లు, శిథిలాలు తొలగించి బయటకు తీసుకెళ్లేందుకు ఈ ఆడిట్ టన్నెళ్లను వినియోగిస్తారు. ఇలా తొలగించిన మట్టి, శిథిలాలను ప్రత్యేకంగా ఇందుకోసం భూసేకరణ చేసిన స్థలంలోనే వేయాల్సి ఉంటుంది. కానీ శ్రీపురం వద్దనున్న ఆడిట్ టన్నెల్ ఎదురుగానే నీటి ప్రవాహానికి అడ్డుగా మట్టిని వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులు, వరదనీటి ప్రవాహం ఎక్కువై నీటి ప్రవాహానికి మట్టి అడ్డుగా ఉండటంతో ఆడిట్ టన్నెల్ వైపు కోత పడింది. వరదనీరు నేరుగా ఆడిట్ టన్నెల్ గుండా 20 కి.మీ. దూరంలోని వట్టెం పంప్‌హౌజ్‌లోకి చేరింది. దాదాపు 2 రోజుల పాటు నీరంతా టన్నెల్ ద్వారా పంప్‌హౌజ్‌లోకి చేరినా అధికారులు గుర్తించలేదన్న విమర్శలున్నాయి. పంప్‌హౌజ్‌లో చేరిన నీటి తొలగింపులోనూ తీవ్ర జాప్యం కన్పిస్తోంది. మోటార్లు నీట మునిగి పక్షం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మూడు మీటర్ల మేర నీటిని మాత్రమే తొలగించడం గమనార్హం. మోటార్లను బయటకు తీయాలంటే ఇంకా సుమారు 18 మీటర్ల నీటిని తోడాల్సి ఉంది. ఈ లెక్కన మొత్తం నీటిని తొలగించేందుకు నెల రోజుల పాటు సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటివరకు నీటిలోనే ఉన్న మోటార్ల పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.



పంప్‌హౌజ్‌లోని నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపిస్తున్న అధికారులు

‘రాష్ట్రంలో రైతు ప్రభుత్వం పనిచేస్తోంది’



అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ పాలక మండలితో మంత్రి జూపల్లి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

అచ్చంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతుందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగిన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డులను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతాయని చెప్పారు. మార్కెట్ యార్డులకు కావాల్సిన వసతులు, సదుపాయాలను సమకూర్చుతామని, ఇందుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు వెనకాడబోమన్నారు. మార్కెట్ యార్డులకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. వారి అవసరాలను గుర్తించి అధికారులు వెంటనే సమకూర్చాలని చెప్పారు. అలాగే మార్కెట్ యార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సమీకరణలు, సామాజిక వర్గాలను బేరీజు వేసుకొని కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం నూతన పాలకమండలిచే జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, రాజేందర్, రామనాథం, రఘురాం, శత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.


బోధనలో నూతన పద్ధతులు అవసరం



గురుకుల పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వెల్దండ: విద్యా బోధనలో నూతన పద్ధతులు అవలంభించాలని, ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలు విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునే విధంగా పరికరాలను ఉపయోగించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం ఆయన వెల్దండలోని సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాగునీరు, వర్షపు నీటి నిల్వ, మరుగుదొడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తో అంచనాలు రూపొందించి నివేదిక పంపించాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి త్వరగా కృషిచేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి వివిధ అంశాలపై ఆరాతీశారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి.. వైద్యసేవలపై ఆరాతీశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ప్రిన్సిపల్ స్వర్ణరత్నం, డాక్టర్ మంజుభార్గవి, రాంనర్సింహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్వేతారెడ్డికి ఘన నివాళి



మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి డాక్టర్ శ్వేతారెడ్డి ఏకాదశ దినకర్మ గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచలో నిర్వహించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. – జడ్చర్ల

కల్వకుర్తిలో గోల్‌మాల్

- టౌన్‌ప్లానింగ్‌లో నిధుల అవకతవకలపై కమిషనర్ విచారణ
- మున్సిపల్ ఉద్యోగుల పాత్రపై అనుమానాలు
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని వెనకేసుకొస్తున్న కొందరు పాలకవర్గ సభ్యులు
- అవినీతి, అక్రమాలపై గతంలోనే ‘సాక్షి’లో కథనాలు



కల్వకుర్తి మున్సిపాలిటీ కార్యాలయం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో సాధారణంగా ఏవైనా జరిమానాలు, ఇతర చలాన్లు విధించిన సమయంలో చిల్లర రశీదు బుక్‌లో రాసి ఆ మొత్తాన్ని వసూలు చేస్తారు. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగంలోనూ ఒక బుక్‌ను అప్పటి కమిషనర్, వాటిని నిర్వహించే అధికారులు కలిసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి అప్పజెప్పారు. అతను ఇష్టారాజ్యంగా జరిమానాలు విధిస్తూ, వచ్చిన డబ్బులను మున్సిపాలిటీ అకౌంట్‌లో జమ చేయలేదు. ఇలా రూ.62 లక్షల వరకు చిల్లర రశీదుల పుస్తకంలో లావాదేవీలు నిర్వహించినా అధికారులు కనీసం పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో లావాదేవీలు చిల్లర రశీదు పుస్తకంలో వసూలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవని మున్సిపాలిటీలోని అధికారులు, ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇదంతా అక్రమంగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకమైన కాంట్రాక్ట్ ఉద్యోగి చేయడం గమనార్హం. ఈ విషయమై గతంలోనే ‘సాక్షి’లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి.

కచ్చితమైన అధికారి అని..

మున్సిపాలిటీలోని పాలకవర్గ సభ్యులు సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చెప్పిన రూల్‌బుక్‌నే చాలామంది ఫాలో అయ్యారని మున్సిపాలిటీలో జోరుగా చర్చ సాగుతోంది. అతను చెప్పినట్లుగా విని చాలామంది ఆ ఉద్యోగి గురించి చెప్పేందుకు వారి వద్దకు వెళ్లిన సమయంలో, అతను చాలా కచ్చితమైన అధికారి, అతను చెప్పినట్టే రూల్ ఉండొచ్చని బాధితులకు చెప్పిన దాఖలాలు ఉన్నాయి. అతను చాలా ఇబ్బంది పెడుతున్నాడని చెప్పినా పట్టించుకోకుండా ఉద్యోగి చెప్పిన విధంగా వ్యవహరించండి లేదంటే ఇబ్బందులు పడతారని చెప్పి పాలకవర్గంలోని కొందరు సభ్యులు చెప్పడం గమనార్హం.

> పట్టణంలోని విద్యానగర్‌కాలనీలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాడు. మున్సిపాలిటీ అనుమతి కోసం దరఖాస్తు చేయగా.. తిరస్కరించారు. తిరిగి దరఖాస్తు చేసుకోవాలని.. అంతా తాను చూసుకుంటానని టౌన్‌ప్లానింగ్‌లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చెప్పారు. దీంతో సదరు వ్యక్తి రూ.1.08 లక్షలను చెక్కు రూపంలో ఇవ్వగా.. మున్సిపాలిటీలో పనిచేసే ఓ రెగ్యులర్ ఉద్యోగి అకౌంట్లో వేసి డబ్బులు డ్రా చేశారు. కానీ, ఇప్పటి వరకు ఇంటి నిర్మాణానికి అనుమతులు రాలేదు. ఈ క్రమంలోనే నూతనంగా వచ్చిన టీపీఓ అనుమతుల గురించి తనకేం తెలియదని చెబుతున్నాడు.

> పట్టణంలోని సీబీఎం కళాశాల ఎదుట హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నూతనంగా భవనాన్ని నిర్మించేందుకు అనుమతుల కోసం మున్సిపాలిటీకి వచ్చాడు. అతనితో మాట్లాడిన టౌన్‌ప్లానింగ్‌లోని సదరు ఉద్యోగి.. అన్నీ తాను చూసుకుంటానని, ఇందుకోసం రూ.3 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. దీంతో సదరు వ్యక్తి ఏప్రిల్ నెలలో రూ.2.80 లక్షలు డీడీ సైతం కట్టాడు. అతనికి ఇప్పటి వరకు నిర్మాణ అనుమతులు రాకపోగా.. అప్పటి కమిషనర్, టీపీఓ ఇద్దరూ బదిలీపై వెళ్లిపోయారు. రూ.కోట్లు పెట్టి భవనాన్ని నిర్మిస్తుండగా.. అనుమతులు రాకపోవడంతో అతను సైతం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు.

కొత్త కమిషనర్ రాకతో..

కొత్తగా మున్సిపాలిటీకి మహమూద్ షేక్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మున్సిపాలిటీ అకౌంట్‌లను సరిచూసుకున్నారు. లెక్కలను చూస్తున్న క్రమంలో చిల్లర రశీదు బుక్‌ల కేటాయింపులను బట్టి టౌన్ ప్లానింగ్‌లో ఇంత పెద్దమొత్తంలో లావాదేవీలు నిర్వహించారని గుర్తించి వాటి వివరాలను అకౌంట్ సిబ్బందితో ఆరాతీశారు. ఒక బుక్‌లో రూ.62 లక్షలు, మరో బుక్‌లో రూ.5 లక్షలు వసూలు చేశారని, అందులో కేవలం రూ.30 లక్షలు మున్సిపాలిటీ అకౌంట్‌లో జమకాలేదని గుర్తించారు. ఇదే విషయాన్ని అకౌంట్ సిబ్బందితో వివరాలు సేకరిస్తుండగానే, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కార్యాలయం నుంచి వెళ్లిపోయారని తెలిసింది. గురువారం సైతం అతను కార్యాలయానికి రాలేదు. ఇలా ఒక్కో శాఖలో ఉన్న బుక్‌లపై కమిషనర్ విచారణ ప్రారంభించడంతో ఇతర ఉద్యోగుల్లోనూ గుబులు మొదలైంది.

ఉద్యోగి లీలలపై ముందే..

మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవకతవకలపై ముందుగానే ‘సాక్షి’లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అయినప్పటికీ మున్సిపల్ ఉన్నతాధికారులు పట్టనట్టుగా వ్యవహరించడం కొసమెరుపు. అప్పట్లో మున్సిపల్ ప్రధాన అధికారిగా ఉన్న వ్యక్తి పేపర్‌లో చాలా వార్తలు వస్తుంటాయి.. వాటిని పట్టించుకుంటే మనం ఉద్యోగం చేయలేమని చెప్పడం కొసమెరుపు. అయితే ప్రస్తుతం ‘సాక్షి’లో వచ్చిన కథనాల మాదిరిగానే సదరు ఉద్యోగి అవకతవకలకు పాల్పడినట్లుగా మున్సిపల్ అధికారులు నిర్ధారించి.. ఉన్నతాధికారులకు కమిషనర్ రిపోర్టు పంపారు.



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనం

చర్యలు ఉంటాయి..



టౌన్ ప్లానింగ్‌లో జరిగిన నిధుల అవకతవకలపై విచారణ చేపట్టి ప్రాథమిక నివేదికను మున్సిపల్ ఉన్నతాధికారులతోపాటు కలెక్టర్‌కు నివేదించాం. మరిన్ని అవకతవకలు ఏమైనా జరిగాయా అన్న కోణంలో మరింత విచారిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి.

– మహమూద్ షేక్, మున్సిపల్ కమిషనర్, కల్వకుర్తి

నేడు ఎస్‌ఎల్‌బీసీకి డిప్యూటీ సీఎం రాక

అచ్చంపేట రూరల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగం, ఇతర పనులను రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఈ మేరకు మండలంలోని మన్నెవారిపల్లి వద్ద ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఔట్‌లెట్‌ను పరిశీలించడానికి శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు రానున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రాత్రి ఎమ్మెల్యే వంశీకృష్ణ ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఔట్‌లెట్, హెలీప్యాడ్, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఇలా..

- ఉదయం 8.45 గంటలకు మినిస్టర్స్ రెసిడెన్సీ నుంచి డిప్యూటీ సీఎం భట్టి బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వెళ్తారు.
- ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో 9.40 గంటలకు అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి ఎస్‌ఎల్‌బీసీ ఔట్‌లెట్ టన్నెల్ వద్ద ఏర్పాటు చేసి హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- ఉదయం 10 గంటలకు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను పరిశీలిస్తారు.
- ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు, డిండి ప్రాజెక్టు, ఉదయ సముద్రం, పిల్లల్‌పల్లి కెనాల్, ధర్మారెడ్డి కెనాల్ ఇతర అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం విద్యుత్ సమస్యలపై ఆ శాఖ ఉన్నతాధికారులతో చర్చిస్తారు.

పూర్తి సబ్సిడీతో చేపపిల్లలు పంపిణీ చేయాలి

లింగాల: మత్స్యకారులకు ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో చేపపిల్లలు వెంటనే పంపిణీ చేయాలని డీఎఫ్‌సీఎస్ చైర్మన్ అంజనేయులు అన్నారు. మండలంలోని రాయవరం పెద్దకుంట, దావుకుంటలలో మత్స్యకారులు తమ సొంత ఖర్చులతో కొనుగోలు చేసిన చేపపిల్లలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో జలాశయాలు నిండుకుండలా ఉన్నాయని, కానీ ప్రభుత్వం మత్స్యకారులకు చేపపిల్లలను పంపిణీ చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. ఏప్రిల్, మే నెలలోనే టెండర్లను పూర్తిచేసి చేప పిల్లలను పంపిణీ చేయాల్సి ఉండగా టెండర్ల ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,448 చెరువులు, కుంటలు ఉండగా.. 19 వేల మంది మత్స్యకారులు, లక్షలాది మంది సభ్యులు ఉన్నారన్నారు. జిల్లా కేంద్రంలో మత్స్యకారుల సౌకర్యార్థం కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు.



కుంటలో చేపపిల్లలు వదులుతున్న మత్స్యకారులు

క్లుప్తంగా

సెల్ఫీ వీడియో తీసుకుని.. యువకుడి బలవన్మరణం


రాజవెంకట్ (ఫైల్)


రాజవెంకట్ రాసిన లెటర్

దేవరకద్ర రూరల్: వేధింపులు తాళలేక, సెల్ఫీ వీడియో తీసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని పెద్దరాజమూర్‌లో చోటు చెసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి రాజవెంకట్(24) గత కొన్నేళ్లుగా తన తండ్రితో కలిసి హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ బేగంపేట ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతంలో గోపాల్, లక్ష్మీప్రసన్న దంపతులు నివశిస్తున్నారు. గోపాల్ భార్యకు నేను ఫోన్ చేస్తున్నానని ఆరోపిస్తూ.. గోపాల్ అతని యజమానితో కలిసి తనను ఫోన్‌లో బెదిరిస్తున్నారని, ఇందులో తన తప్పు ఏం లేదని, గోపాల్ భార్య మరొకరితో మాట్లాడుతుండటం చూసి వారికి చెప్పానని అదే తనకు సమస్యగా మారిందని వాపోయాడు. వారి వేధింపులు తాళలేక గ్రామానికి వచ్చి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లెటర్ రాసి పెట్టాడు. ఈ ఘటనపై రాజవెంకట్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలిసులు తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


గొల్ల లింగన్న (ఫైల్)

ఎర్రవల్లి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ స్వాతి కథనం మేరకు.. మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన గొల్ల లింగన్న (54) కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్థాపానికి గురై గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే లింగన్న మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆయన భార్య గొల్ల లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. ఆటో డ్రైవర్ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: గుర్తు తెలియని వాహనం ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ అక్కడిక్కడే మృతి చెందగా.. మరో ప్రయాణికుడికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా మరికల్ మండలం జిన్నారం గ్రామానికి చెందిన రవి(35) సొంత ఆటోలో మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో ఉన్న తన అత్తను చూడటానికి గురువారం తెల్లవారుజామున జిన్నారం నుంచి మహబూబ్‌నగర్‌కు బయల్దేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలోని ధర్మపూర్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఆటోను వేగంగా ఢీకొట్టడంతో రవి తల పూర్తిగా ఛిద్రం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న మరో ప్రయాణికుడికి గాయాలయ్యాయి. మృతుడి భార్య తెలుగు లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో మాజీ సర్పంచ్..


ఎల్లయ్య(ఫైల్)

కల్వకుర్తిరూరల్: మండలంలోని తుర్కలపల్లి మాజీ సర్పంచ్ ఎల్లయ్య(45) గురువారం రాత్రి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు ఎల్లయ్యను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.


కారు బోల్తా : ముగ్గురికి గాయాలు



అడ్డాకుల: కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలైన సంఘటన 44వ జాతీయ రహదారిపై అడ్డాకుల సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ వైపు నుంచి కారు కొత్తకోట వైపు వెళ్తుండగా అడ్డాకుల దాటిన తర్వాత వనపర్తి డిపోకు చెందిన బస్సును ఓవర్ టెక్ చేయబోయి ప్రమాదానికి గురైంది. అదుపు తప్పిన కారు డివైడర్‌ను ఢీకొని బస్సుకు తాకుతూ రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా పడింది. అందులో ఉన్న అనసూయకు తీవ్ర గాయాలు కాగా, శ్రీనివాస్, విజయలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వెంటనే రోడ్డు నిర్వాహకులు, అంబులెన్స్ సిబ్బంది అక్కడికి వచ్చి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

కుర్చీ.. భర్తీ ఎప్పుడో?

- ఖాళీగా మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి
- నెలన్నర దాటిన అవిశ్వాసం
- మున్సిపల్ పాలన వ్యవహారంలో పెద్దగా జోక్యం చేసుకోని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి





జడ్చర్ల: స్థానిక మున్సిపల్ చైర్మన్ పదవి ఖాళీగా ఉండటంతో ఓ పెద్ద దిక్కు లేకుండా పోయింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న దోరేపల్లి లక్ష్మిపై సభ్యులు అవిశ్వాసం ప్రతిపాదించి పదవి నుంచి దింపివేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో చైర్‌పర్సన్ కుర్చీ వెలవెలబోతుంది. జూలై 25న అవిశ్వాస సమావేశం జరిగినా.. ఇప్పటి వరకు చైర్మన్ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయకపోవడం గమనార్హం. అవిశ్వాసం నెగ్గిన పది రోజుల్లోపే నోటిఫికేషన్ వస్తుందని సభ్యులు భావించినా.. రోజు రోజుకు ఆలస్యం చోటు చేసుకుంటుండటంతో సభ్యుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది.

ఎక్కడికక్కడే సమస్యలు..

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రధానంగా డ్రెయినేజీ, అంతర్గత రహదారుల సమస్యలు పట్టణవాసులను వేధిస్తున్నాయి. వీటికి తోడు పందులు, వీధి కుక్కల బెడద తీవ్రమైంది. వాటితో పాటు దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముంపు కాలనీల్లో వరద సమస్యలు, తాగునీటి కలుషితంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాల్సిన అధికార, విపక్ష నాయకులు ఒకరిపై ఒకరు చేసుకునే ఆరోపణలకే పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

తీవ్రమవుతున్న రోగాలు..

అసలే వర్షాకాలం.. ఆపై వరదలు.. రోగాలు తీవ్రమవుతున్నాయి. ఇవి చాలవన్నట్లుగా సంక్షేమ పథకాల అమలు, మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా కొనసాగుతుంది. పాలకమండలి సభ్యులు ఎవరికివారే యమునా తీరే అనే చందంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మున్సిపల్ పాలన వ్యవహారంలో పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. అంటి ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మెజార్టీ సభ్యులు బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉండటంతో కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్ ఎన్నికను పెద్దగా పట్టించుకోవడం లేదు. అంతేగాక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆది నుంచి పాలకమండలిపై అవినీతి ఆరోపణలు చేస్తూ.. వస్తున్నారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం, కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియలో ఆయన జోక్యం చేసుకోవడం లేదు. పాలక మండలి సమావేశాలకు సైతం ఆయన హాజరుకావడం లేదు. దీంతో మున్సిపల్ పాలనకు ఎమ్మెల్యే దూరం పాటిస్తూ.. వస్తున్నారు. ఓ వైపు ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం మరో వైపు అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థి ఓటమి చెందడంతో నాటి నుంచి పాలన వ్యవహారాలపై బీఆర్ఎస్ పాలకమండలి సభ్యులు సైతం శ్రద్ధ కనబరచడం లేదు.

నిరాశలో ఆశావహులు..

చైర్‌పర్సన్ పదవిపై ఆశలు పెట్టుకున్న పలువురు సభ్యులు ఎన్నిక నోటిఫికేషన్ ఆలస్యం అవుతుండటంతో నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే పుణ్యకాలం గడిచిపోయిందని, ఇక మిగిలిన కాస్త కాలం కూడా కరిగిపోతే పదవి దక్కినా ఫలితం శూన్యమనే భావనను కొందరు వ్యక్తం చేస్తున్నారు. బీసీ మహిళకు రిజర్వు అయిన చైర్‌పర్సన్ పదవికి ముగ్గురు సభ్యులు పోటీపడుతున్నారు.

పెద్దాయపల్లిలో వ్యక్తి దారుణ హత్య


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి


పర్వతాలు మృతదేహం

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలం పెద్దాయపల్లి శివారులో ఓ వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు గొంతు కోసి హతమార్చారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దాయపల్లికి చెందిన వడ్డె పర్వతాలు (35) గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద టీ స్టాల్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 9 గంటలైనా పర్వతాలు ఇంటికి వెళ్లకపోవడంతో అతడి భార్య అనసూయ ఫోన్ చేయగా.. 10 నిమిషాల్లో ఇంటికి వస్తానని చెప్పాడు. కొంత సమయం తర్వాత మళ్లీ ఫోన్ చేస్తే ఎటువంటి సమాధానం రాలేదు. కుటుంబ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న గ్రామ యువకులు టీ స్టాల్, పరిసర ప్రాంతాల్లో గాలించారు. సమీపంలోని ఓ వెంచర్‌లో అతడు రక్తపు మడుగులో మృతిచెంది కనిపించడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

ఘటనా స్థలాన్ని గురువారం ఎస్పీ జానకి పరిశీలించారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని.. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట బాలానగర్ ఎస్ఐ తిరుపాజి, రాజాపూర్ ఎస్ఐ రవి ఉన్నారు.

బిల్లులు చెల్లించాలని పాడిరైతుల ఆందోళన


రహదారిపై పాలు పారబోసి నిరసన తెలుపుతున్న పాడిరైతులు

వెల్దండ: పాల బిల్లులు చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలో హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై పాడి రైతులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాడిరైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి అనుసంధానంగా పాడిపరిశ్రమను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న తమకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు అందించడం లేదన్నారు. గతంలో ప్రతి 15రోజులకు ఒకసారి పాలబిల్లులు వచ్చేవని, గత కొన్ని నెలలుగా 5 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వాపోయారు. పశువుల దాణ ఖర్చులకు కూడా డబ్బులు అందడం లేదని వాపోయారు. పాలను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. పాడిరైతుల ధర్నాతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, యాకుబ్, రైతులు విజేందర్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేష్, నిరంజన్, రంగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు


తవ్వకాలు జరిపిన ఆలయం


వంగూరు: వంగూరు మండలం నర్సంపల్లి గ్రామశివారులోని శివాలయ ఆవరణలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఆ ప్రాంతంలో నిమ్మకాయలు, పసుపు, ఇతర వస్తువులను వేయడంతో పాటు ఆలయం ముందు భాగంలో గుంత తీసి తర్వాత పూడ్చినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ ఇబ్రహీం శివాలయం వద్ద తవ్వకాలను పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

నలుగురు నిందితుల అరెస్టు

మల్దకల్: మండలంలోని మద్దెలబండ గ్రామంలో ఈనెల 13న రైతు నర్సింహులు హత్యకు గురయ్యారు. ఏఎస్ఐ ఈశ్వరయ్య అనుమానాస్పద కేసుగా నమోదు చేయగా, సీఐ నాగేశ్వరరెడ్డి విచారణ చేపట్టారు. హత్యకు పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు పెద్ద ఎత్తుల ఈనెల 14న మల్దకల్ బస్టాండ్ చౌరస్తాలో మృతదేహంతో ధర్నా నిర్వహించారు. బుధవారం హత్యకు పాల్పడిన నిందితులు భార్య పద్మమ్మ, నర్సింహులు, వీరన్న, ఆర్ఎంపీ డాక్టర్ హుస్సేన్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ నిందితులను విచారించి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు

- అధిక వర్షాల దృష్ట్యా అప్రమత్తత అవసరం
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్



కోస్గి: ఈ ఏడాది జిల్లాలో పలు ప్రాంతాల్లో వరిని అధిక మొత్తంలో సాగు చేశారు. వర్షాలు కురిసి భూగర్భజలం సమృద్ధిగా ఉండటంతో వరి పంట ఏపుగా పెరుగుతుంది. ఎటు చూసినా పచ్చని వరి పొలాలే దర్శనమిస్తున్నాయి. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలవడంతో చీడపీడలు, పురుగు ఉధృతి పెరిగే ప్రమాదం ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీరు నిలవడంతో వరికి సోకే తెగుళ్లు, వివిధ రకాల పురుగులతో అప్రమత్తంగా ఉండాలని, తెగుళ్ల బారిన పడిన పంటలను కాపాడేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ పలు నివారణ సూచనలు వివరించారు.

తెగుళ్ల యాజమాన్యం..

అగ్గి తెగులు: ఆకులపై నూలు కండె ఆకారంలో గోదుమ రంగు మచ్చలు ఏర్పడి, చివరి ఆకుల వరకు పూర్తిగా ఎండిపోయినట్లు కనిపిస్తాయి. పైరు పూత దశలో ఉన్నప్పుడు వెన్ను, మెడ భాగంలో ఈ తెగులు ఆశిస్తే వరి కొమ్మ మెడ ఇరిగిపోయి తాలు గింజలు ఏర్పడుతాయి.

నివారణ : కిలో విత్తనానికి 4 గ్రాముల కార్బెండిజమ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. ట్రై సైక్లోజోల్ 75 శాతం మందును 06 గ్రాములు లేదా ఎడిఫెన్ ఫాస్ 1 మి.లీను లీటర్ నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలి.

కాండం కుళ్లు తెగులు

ఈ తెగులు అండరమేర్పడే దశ నుంచి పంట పాలు పోసుకునే వరకు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది.

నివారణ : తెగులు సోకిన పొలంలో పరిశుభ్రత పాటించాలి. విత్తన శుద్ధి చేయాలి. తెగులు లక్షణాలను గుర్తిస్తే వాలిడామైసిన్ 2 మి.లీ లేదా హెక్సాకోనోజల్ 2 మి.లీ మోతాదులో లీటరు నీటికి కలిపి 15 రోజులకు ఒకసారి రెండు సార్లు పిచికారీ చేయాలి.

ఎండాకు తెగులు..

ఈ తెగులు సోకిన పంటలో ఆకు అంచుల వెంట పసుపు రంగు మచ్చలు ప్రారంభమై చివరకు ఆకులు పూర్తిగా ఎండిపోతాయి.

నివారణ : ప్రొపికోనోజల్ 1 మి.లీ లేదా హెక్సాకోనోజల్ 2 మి.లీ లేదా వాలిడామైసిన్ 2 మి.లీ మోతాదులో ఏదేని మందును లీటరు నీటికి కలిపి పొలంలో నీరు మొత్తం తీసివేసి మొదళ్ల వద్ద బాగా తడిసేలా పిచికారీ చేయాలి.

పొడ తెగులు, మానిపండు తెగులు

ఈ తెగులు పంట పుష్పించే దశలో ఆశిస్తుంది. అండాశయం ఆకుపచ్చ రంగు ముద్దగా మారిన తర్వాత గింజలన్ని పసుపురంగు ఉండలాగా మారి పంట దిగుబడి తగ్గుతుంది.

నివారణ : హెక్సాకోనోజల్ 2 మి.లీ లేదా ప్రొపికోనోజల్ 1 మి.లీ లేదా వాలిడామైసిన్ 2 మి.లీ మోతాదులో 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే మోనోక్రొటోఫాస్ 2 మి.లీ మోతాదులో లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పురుగులు.. నివారణ చర్యలు

కాండం తొలిచే పురుగు

ఈ పురుగు సోకితే పిలకలు చనిపోతాయి. వెన్నులు తెల్ల కంకులుగా మారుతాయి. 5 శాతం మొవ్వులు చనిపోతే వెంటనే సస్యరక్షణ చేపట్టాలి.

నివారణ : క్లోరోఫైరిపాస్ 2.5 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫెట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లికోడు

ఈ పురుగు సోకకముందే వరి పంట నాటిన 10 నుంచి 15 రోజుల వ్యవధిలో ఎకరాకు 10 కిలోల కార్బోఫ్యూరాన్ లేదా 6 కిలోల ఫోరేట్ గుళికల మందు వేయాలి.

సుడిదోమ/దోమపోటు

వరిలో దోమపోటు నివారణకు నారు నాటే సమయంలోనే ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ బాటలు వదిలి నాటు వేసుకోవాలి. దోమపోటు, సుడిదోమ గుర్తించిన వెంటనే ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రైడ్ 2.2 మి.లీ మోతాదులో లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

డీ–82 కాల్వను పరిశీలించిన ఎమ్మెల్యే


వెల్దండలో డీ-82 కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు

వెల్దండ: మండల కేంద్రంలోని డీ–82 కాల్వను గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వలో నీరు తక్కువగా ఉన్నప్పుడు రైతులు వాటికి గండి పెట్టి నీరు తీసుకోవడంతో కాల్వలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు గండి పడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం కోట్ల నిధులను ఖర్చు చేసి రైతుల ప్రయోజనాల కోసం కృష్ణానది నీటిని తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. కెఎల్ఐ కాల్వలో భాగంగా డీ–82 ద్వారా 59 కిలోమీటర్ల దూరంలో ఉన్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలోని చివరి ఆయకట్టు నాగిళ్ల గ్రామానికి సాగునీరు అందిస్తామన్నారు. గతంలో అసంపూర్తిగా ఉన్న కాల్వ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇటీవల అకాల వర్షాలతో పనులు నిలిచిపోయాయని, త్వరలోనే పనులను పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతులకు దసరా పండుగ నాటికి అందిస్తామన్నారు.

కల్వర్టు పనులను వేగవంతంగా చేయాలి..

కాల్వలను దాటేందుకు రైతుల అవసరాల కోసం కల్వర్టు పనులను వేగవంతంగా చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రైతులు కాల్వలను దాటేందుకు సిమెంట్ పైపులు వేసి తాత్కాలికంగా రోడ్లు వేసుకోవడంతో కెఎల్ఐ కాల్వలకు గండ్లు పడుతున్నట్లు పేర్కొన్నారు. కోట్లు ఖర్చుచేసిన చిన్నచిన్న పనుల వల్ల రైతులకు సాగు నీరు అందడం లేదన్నారు. కాల్వలపై అధికారులు ప్రత్యేక దృష్టికి పెట్టి అవసరమైన చోట్ల కల్వర్టులను ఏర్పాటు చేయాలన్నారు. డీ–82కాల్వలోని 52 కిలోమీటర్ వద్ద సింగంపల్లిలో మిషన్ భగీరథ పైపు లైన్ అడ్డు రావడంతో పైపులను మార్చి కెఎల్ఐ కాల్వ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కాల్వల నిర్మాణ పనుల కోసం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధుల కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ శ్రీకాంత్‌రెడ్డి, డీఈ దేవన్న, రాఘవేందర్‌రెడ్డి, వెంకట్‌రావు, కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, మోతీలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, జయప్రకాష్, నారాయణ, పుల్లయ్య, అలీ, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

సమష్టిగా సమస్యలను పరిష్కరించుకుందాం


సమావేశమైన అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు

జోగుళాంబ శక్తిపీఠం: అర్చక ఉద్యోగుల సంక్షేమం, క్రమం తప్పకుండా వేతనాలు అందించడం, పదోన్నతులు తదితర ప్రయోజనాల విషయంలో దేవాదాయశాఖ అధికారులు నాన్చుడి ధోరణి అవలంబిస్తున్నారని.. ఆయా సమస్యల పరిష్కారానికి అందరూ ఏకతాటిపైకి రావాలని అర్చక ఉద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. గురువారం మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు భేతి రంగారెడ్డి, డీవీఆర్ శర్మ, శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్చక ఉద్యోగులను అణచివేసేందుకు దేవాదాయ శాఖలో ఇద్దరు అధికారులు ఉద్దేశపూర్వకంగా వేతనాలు అందించడంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా పదోన్నతులు, అర్హులైన అర్చక ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందజేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి అర్చక ఉద్యోగులు సమష్టిగా ముందుకుసాగాలని తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జయపాల్ రెడ్డి, రాష్ట్ర అర్చక సంఘం కార్యదర్శి ఆనంద్ శర్మ, జిల్లా ఉపాధ్యక్షులు నిత్యానందాచారి, శివానందాచారి, ముఖ్య బాధ్యులు రవిప్రకాష్, నగేష్, సంజీవ రెడ్డి ఉన్నారు.

4 యూనిట్లలో విద్యుదుత్పత్తి


నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి పంపింగ్

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు బుధవారం సాయంత్రం 16,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం సాయంత్రానికి 15, 500క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 15,120 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఆవిరి రూపంలో 95 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కుడి కాల్వకు 700 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంత కాల్వకు 900 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 19,252 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.562 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

- ఎగువలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు, 183.799 ఎంయూ, దిగువలో 2 యూనిట్ల ద్వారా 80 మెగావాట్లు, 156.852 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామని ఎస్ఈలు సురేష్, సూరిబాబు పేర్కొన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 340.631 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 879.3 అడుగులు

శ్రీశైలం జలాశయంలో గురువారం నీటిమట్టం 879.3 అడుగుల వద్ద 184.6012 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 2,280 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. శ్రీశైలంలో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 35,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,585, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భకేంద్రంలో 16.771 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 13.165 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం తగదు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే సహించమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు గోపాల్, బీటీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు అన్నారు. కార్మిక చట్టాలు, వెల్ఫేర్ బోర్డును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం భవన నిర్మాణ కార్మిక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు మళ్లించాలని ప్రయత్నించడం తగదన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను దుర్వినియోగం చేయకుండా కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ కార్యదర్శి కురుమూర్తి, జేఏసీ నాయకులు వెంకటన్న, రాజు, కుర్మన్న, మన్యం, మంజుల, లక్ష్మమ్మ, కృష్ణవేణి, బాలకిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లికి చెందిన రాజేశ్వరి (20) అదృశ్యమైనట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిందని.. కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయిందన్నారు. యువతి తల్లి మొగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మరో యువకుడు..

జడ్చర్ల ఇందిరానగర్ కాలనీకి చెందిన మహేష్ (29) అదృశ్యమైనట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. గత ఫిబ్రవరిలో ఇంట్లో జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడని.. యువకుడి తల్లి రేఖంధారి హిందుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా...

స్పిన్నర్ల, నేత కార్మికుల వేతనాల పెంపు

- కేంద్ర ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ చైర్మన్ మనోజ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని స్పిన్నర్లకు 25 శాతం, నేత కార్మికులకు 7 శాతం వేతనాలు పెరుగుతున్నట్లు కేంద్ర ఖాదీ, గ్రామ పరిశ్రమల కమిషన్ చైర్మన్ మనోజ్ కుమార్ వెల్లడించారు. మహాత్మాగాంధీ జయంతి అక్టోబర్ 2 నుంచి పెరిగిన వేతనాలు అమలులోకి వస్తాయని ప్రకటించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖాదీ కార్మికులకు వరాలు ప్రకటించారు. న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఎంఈజీపీ 1,100 కొత్త యూనిట్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 3,911 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.101 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీని అందించినట్లు చెప్పారు. కొత్త యూనిట్ల ప్రారంభంతో 43,021 మందికి ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. పీఎంఈజీపీ ద్వారా గత పదేళ్లలో 9.58 లక్షల కొత్త ప్రాజెక్టులతో 83.48 లక్షల మందికి ఉపాధి లభించిందని చెప్పారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 10.17 లక్షల కొత్త ఉద్యోగాలను కల్పించినట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 3 వేల ఖాదీ సంస్థల ద్వారా 4.98 లక్షల మంది ఖాదీ కళాకారులు ఉపాధి పొందుతున్నారని, వీరిలో 80 శాతం మంది మహిళలన్నారు. ఖాదీ ద్వారా గ్రామీణ భారతదేశం ఆర్థికంగా సాధికారత సాధిస్తుందనడానికి ఇదే ప్రతీక అని అన్నారు.

'నెస్ట్స్' స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా శరత్

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి జాతీయ కమిటీలో చోటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ శరత్‌కు కేంద్ర ప్రభుత్వ కమిటీలో చోటు దక్కింది. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (నెస్ట్స్)లో శరత్‌ను స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిపాటు ఆయన కమిటీలో కొనసాగనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ గిరిజన ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోంది. వీటి నిర్వహణ, పర్యవేక్షణతోపాటు కేంద్ర ప్రభుత్వానికి సలహాలు అందించడంపై స్టీరింగ్ కమిటీ కీలకం కానుంది. శరత్‌ను దేశంలోని అన్ని రాష్ట్రాల తరపున కమిటీ సభ్యుడిగా కేంద్రం నామినేట్ చేసింది. ఈ సందర్భంగా గిరిజన, ఏకలవ్య మోడల్ పాఠశాలల, గిరిజన గురుకుల సిబ్బంది శరత్‌ను అభినందించారు.

రేషన్ కార్డులకు సన్న బియ్యం ఎలా?

జనవరి నుంచే రేషన్ షాపులకు సన్నబియ్యం అని ప్రకటించిన ప్రభుత్వం

- ప్రస్తుతం సర్కార్ గోడౌన్‌లలో సన్న బియ్యం నిల్వలు స్వల్పమే
- పౌరసరఫరాల శాఖ సేకరిస్తున్న ధాన్యంలో 95 శాతం దొడ్డు వడ్లే
- ఈ ఖరీఫ్‌లో సన్న ధాన్యం మార్కెట్‌కు వస్తుందని సర్కార్ భావన
- రూ.500 బోనస్ ప్రకటనతో పంట పెరుగుతుందని అంచనా

సాక్షి, హైదరాబాద్: రేషన్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం రాష్ట్రంలోని పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లలో సన్నబియ్యం నిల్వలు 50 వేల మెట్రిక్ టన్నులు కూడా లేవని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పంపిణీకి అవసరమయ్యే సన్న బియ్యాన్ని ఎలా సేకరించాలనే విషయమై సంస్థ తర్జన భర్జన పడుతోంది. ఖరీఫ్ పంట అక్టోబర్ నుంచి మార్కెట్‌లోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ఎంత మేరకు ధాన్యం వస్తుందనే విషయంలో స్పష్టత లేదు. వచ్చిన సన్నాలను మరాడించి సన్న బియ్యంగా జనవరి నుంచి రేషన్ దుకాణాలకు పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

24 ఎల్ఎంటీల బియ్యం అవసరం

రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో రేషన్‌కార్డులు 89.96 లక్షలున్నాయి. ఈ కార్డుల లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు నెలకు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బియ్యం అవసరం. అంటే ఏడాదికి 21.60 ఎల్ఎంటీల సన్నబియ్యం కావాలి. ఇవికాకుండా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంక్షేమ హాస్టళ్లకు, మధ్యాహ్న భోజన పథకానికి కలిపి ఏటా 2.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కావాలి. అంటే ఏటా సన్నబియ్యం 24 ఎల్ఎంటీలు అవసరమవుతుంది. ఇందుకోసం 36 ఎల్ఎంటీల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. విద్యార్థులకు గత ప్రభుత్వ హయాం నుంచే సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నారు. ఈ ఏడాది సన్నబియ్యం కొరత ఏర్పడటంతో గత మే నెలలో 2.2 ఎల్ఎంటీ సన్న బియ్యం కొనుగోలు కోసం టెండర్లను ఆహ్వానించిన ప్రభుత్వం తరువాత వెనకడుగు వేసింది.

ఖరీఫ్‌లో వచ్చే సన్న ధాన్యం 5 ఎల్ఎంటీ లోపే..

రాష్ట్రంలో సగటున ఏటా కోటిన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ సేకరిస్తుంది. ఇందులో ఖరీఫ్‌లో మాత్రమే రైతులు సన్నాలను పండిస్తున్నారు. ఈ సీజన్‌లో పౌరసరఫరాల శాఖ 50 నుంచి 60 ఎల్ఎంటీల ధాన్యం మాత్రమే సేకరించగలుగుతోంది. ఇందులో 5 ఎల్ఎంటీలే సన్నాలు ఉంటున్నాయి. రైతులు ఈ సీజన్‌లో సన్నాలను పండించినప్పటికీ, తమ అవసరాలకు నిల్వ చేసుకుంటుండటంతో మార్కెట్‌కు రావట్లేదు. నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, నారాయణపేట జిల్లాల్లో పండే మేలు రకం సన్న ధాన్యం నేరుగా మిల్లులకు వెళ్లడం లేదంటే బియ్యంగా మార్చి విక్రయించడం జరుగుతోంది. రబీలో వచ్చే మరో 70 ఎల్ఎంటీల ధాన్యంలో సన్నాలు నిల్. రాష్ట్ర వాతావరణం రీత్యా రబీలో సన్న ధాన్యం పండిస్తే, నూకల శాతం ఎక్కువగా ఉంటుంది. ఇది దీర్ఘకాల పంట కావడంతో రైతులు దొడ్డు ధాన్యాన్నే పండిస్తున్నారు.



ఈ ఖరీఫ్ సీజన్‌పై సర్కార్ ఆశ

రూ.500 బోనస్ ప్రకటనతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సన్నాలను రైతులు అధికంగా పండించినట్లు ప్రభుత్వం భావిస్తోంది. ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,320 ఉండగా, ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తే ఆ మొత్తం రూ. 2,820 అవుతుంది. కాగా 30 రకాలను రూ. 500 బోనస్ ఇచ్చే ఫైన్ వెరైటీలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫైన్ వెరైటీల్లో అధిక డిమాండ్ ఉన్న హెచ్ఎంటీ, సోనా మసూరి, జైశ్రీరాం వంటి రకాలు అధిక ధరలకు అమ్ముడుపోయినా, మిగతా వెరైటీలకు డిమాండ్ లేకపోవడంతో అవి మార్కెట్‌కు వస్తాయని భావిస్తోంది. అక్టోబర్ చివరి నుంచి ధాన్యం సేకరణ చేపట్టి, సన్నాలను వెంటవెంటనే మిల్లింగ్ చేస్తే జనవరి నాటికి రేషన్ దుకాణాలకు పంపవచ్చని ఓ అధికారి చెప్పారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- 20 నుంచి 45 నిమిషాల్లో వైద్యచికిత్స అందేలా కార్యాచరణ
- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందేలా ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు
- నర్సంపేటలో జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, వరంగల్/నర్సంపేట: ఏ ప్రభుత్వానికైనా మొదటి ప్రాధాన్యంగా విద్య, వైద్యం ఉండాలి.. అవి అమలు చేసేదిశగా మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ.183 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య కళాశాలను గురువారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4 వేల మెడికల్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల ఖాళీలు భర్తీ చేశామని వెల్లడించారు. 7 వేల మందికి నర్సింగ్ పోస్టింగ్‌లు ఇచ్చామని, త్వరలో ఇంకో 2,500 మందికి పోస్టింగ్ ఇచ్చే దిశగా నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 'సామాన్యులకు ఎక్కడి నుంచైనా



20 నుంచి 45 నిమిషాల్లో వైద్యచికిత్స అందేవిధంగా ప్రాథమిక, ఏరియా, జిల్లా ఆస్పత్రులను నిర్మించే ఏర్పాట్లు చేస్తున్నాం. సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులోకి వచ్చే విధంగా 108, 104, 102 ఆరోగ్యశ్రీ ట్రస్టు లాంటివి కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. 2004 నుంచి ఇప్పటివరకు ట్రీట్‌మెంట్ ప్రొసీజర్ చార్జెస్ గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా పెంచలేదు. కానీ మా ప్రభుత్వం ఏర్పాటు కాగానే 40 శాతం పెంచింది. దానికోసం రూ.4,000 కోట్లు అదనంగా ఖర్చు చేశాం'అని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన గంట (గోల్డెన్ అవర్)లోపు వైద్యం అందించే విధంగా తెలంగాణవ్యాప్తంగా ట్రామా సెంటర్లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న మిషన్ భగీరథలో భారీ అవినీతి జరిగిందని, రూ.46వేల కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్లు పక్కదారి పట్టాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథపై సర్వే నిర్వహించగా, 53 శాతం ఇళ్లకు మంచి నీరు అందడం లేదనే భయంకరమైన విషయాలు వెలుగు చూశాయని వెల్లడించారు. ఈ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రజల కోసం చేసినట్టుగా లేదని, వారి జేబులు నింపుకోవడానికి చేసినట్టుగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, డాక్టర్ మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, డీఎంఈ వాణి పాల్గొన్నారు.

మంత్రుల నోట వైఎస్ అభివృద్ధి మాట

దేశ చరిత్రలోనే పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి తీసుకున్న నిర్ణయాలను మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ కొనియాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదలకు వైఎస్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి అధిక ప్రాధాన్యం ఇచ్చారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అంతే ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. పేదల సంక్షేమానికి కృషి చేసిన వైఎస్ సేవలు మరచిపోలేమన్నారు.

స్కిల్స్ వర్సిటీలో భాగస్వాములు కండి

▶ మొదటి పేజీ తరువాయి

ఉందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటి నుంచి యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందని తెలిపారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి, 2028 ఒలింపిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణ అందిస్తుందని చెప్పారు.

పట్టాలు ముఖ్యం కాదు.. నైపుణ్యం కావాలి

డిగ్రీ, పీజీ పట్టాలు ఉంటే సరిపోదని, ఏటేటా లక్షలాది మంది యువకులు డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్నప్పటికీ, అందరూ ఉద్యోగాలు సాధించలేక పోతున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది యువకులు ఒక ఉద్యోగం ఇప్పించమని తన వద్దకు వస్తున్నారంటూ తనకు ఎదురైన కొన్ని అనుభవాలను వివరించారు. ఇదే సమయంలో పరిశ్రమలు మానవ వనరుల కొరతను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఈ అంతరాన్ని తొలిగించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాలని, తద్వారా యువత ఉపాధికి ఢోకా ఉండదని భావించినట్లు తెలిపారు.

ప్రపంచ గమ్యస్థానంగా హైదరాబాద్: దుద్దిళ్ల

స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించి పలు కీలక అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకుందని అన్నారు. ఇందులో భాగంగా కొత్తగా ఫ్యూచర్ సిటీని నెలకొల్పుతోందని, ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని చెప్పారు. ముఖ్యమంత్రి స్వీయ ఆలోచనతో త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ లో కొత్త కోర్సులు ప్రారంభమవటం ఆనందంగా ఉందన్నారు.

సీఎం ఆలోచనలో దార్శనికత ఉంది: ఆనంద్ మహీంద్రా

తెలంగాణ నుంచి నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచానికి అందించాలన్న ముఖ్యమంత్రి ఆలోచన గొప్పదని ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. ప్రభుత్వాలు సబ్సిడీలు, ఆకర్షణీయమైన పథకాలకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తాయని, కానీ యువతను నిపుణులుగా తీర్చిదిద్దాలని భావించడంలో దార్శనికత ఉందన్నారు. అతి పెద్ద యూఎస్ కాన్సులేట్ తెలంగాణలో ఉందని, ఇక్కడి నుంచే అమెరికాకు ఎక్కువ మంది వెళుతున్నారని తెలిపారు. స్కిల్స్ వర్సిటీలో దసరా పండుగ తర్వాత కోర్సులు ప్రారంభించనున్నట్లు బోర్డు తెలిపింది. సమావేశంలో బోర్డు కో చైర్మన్ శ్రీనిరాజు, సభ్యులు పి.దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బోర్డు సభ్యులు మనీష్ సభర్వాల్, సంజీవ్ బిక్చందానీ, ఎంఎం మురుగప్పన్, డాక్టర్ కేపీ కృష్ణన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

ఎల్ఆర్ఎస్‌పై స్పష్టత ఇవ్వాలి

పాలమూరు: ఎల్ఆర్ఎస్ విధానంపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, సీఎం రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రియల్ ఎస్టేట్స్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అన్వార్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత వెంచర్ల ప్లాట్స్ రిజిస్ట్రేషన్ కోసం ఎదురుచూస్తున్న ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. పట్టా పాస్ బుక్‌పై ఎకరం లోపు ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేసే విధంగా ప్రభుత్వం జీవో జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో హైదర్ అలీ,చందుయాదవ్, రవికిరణ్, బాబునాయక్, కృష్ణయ్య, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి తనిఖీలు



రాజాపూర్: రైతుల పంట పొలాల్లోకి పరిశ్రమల నుంచి కాలుష్యపు జలాలు వదులుతుండటంతో మండలంలోని రాయపల్లి గ్రామ రైతులు ఇటీవల సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేష్, ఏఈ విద్యులత సిబ్బందితో కలిసి రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, పోలేపల్లి గ్రామాల శివారులోని రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం సెజ్‌లోని ఆమ్నిల్, ఎవర్టాజన్, అరబిందో తదితర పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టారు. కాగా, కాలుష్యం కారణంగా పంటలు పండటం లేదని.. పాడి పశువులు మృతి చెందుతున్నాయని అధికారులతో రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. కాలుష్యం వదులుతున్న పరిశ్రమలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అయితే పీసీబీ అధికారుల తనిఖీల విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి.. ఈఈకి ఫోన్‌చేసి పంట పొలాల్లోకి కాలుష్యం వదులుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీలను చిన్నచూపు చూస్తే సహించం



ముడుమాల్ గ్రామాన్ని సందర్శించిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, అధికారులు

- దళిత జంట పెళ్లిని అడ్డుకున్న జూనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు
- ప్రతి ఆలయం ఎదుట అన్ని కులాల వారికి ప్రవేశం ఉంటుందని బోర్డులు ఏర్పాటు చేయాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మక్తల్/కృష్ణా: ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో అవమానించినా, చిన్నచూపు చూసినా సహించే ప్రసక్తే లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువారం మక్తల్‌తోపాటు కృష్ణా మండలంలోని ముడుమాల్ గ్రామాలను అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ మదన్‌మోహన్, డీఎస్పీ మహేష్‌తో కలిసి సందర్శించారు. ఇటీవల చోటుచేసుకున్న దళిత జంట పెళ్లి ఘటనపై ముడుమాల్‌లోని రైతు వేదికలో గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారి నుంచి నిజానిజాలను ప్రత్యక్ష సాక్షుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. సమాజంలో నేటికీ కుల వివక్షతను పాటించడం దారుణమని అన్నారు. ముడుమాల్ గ్రామంలో వివాహం నిమిత్తం ఆలయానికి వచ్చిన దళిత జంటను ఆలయంలోకి రానివ్వకుండా బయటే వివాహం జరిగే విధంగా అర్చకుడు చక్రపాణి (జూనియర్ అసిస్టెంట్) చేయడం క్షమించరాని నేరమన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన్ను ప్రభుత్వ ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఇలాంటి వివక్ష జిల్లాలో ఎక్కడా కొనసాగకూడదని, అందుకుగాను ప్రతి ఆలయం ఎదుట అన్ని కులాల వారికి, దళితులకు ఆలయ ప్రవేశం ఉంటుందని బోర్డు ఏర్పాటు చేయాలని రెవెన్యూ, పోలీస్ శాఖకు ఆదేశించారు. గ్రామాల్లో వివక్షతను రూపుమాపేందుకు స్థానిక రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ప్రతి నెల చివరి వారంలో ఏదో ఒక గ్రామంలో సమావేశాన్ని నిర్వహించి చట్టాలపై, పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సదరు దళిత జంట ఇంటిని వారు సందర్శించారు. త్వరలోనే వారికి ఇందిరమ్మ ఇంటిని, అలాగే సాగు చేసుకునేందుకు అవసరమైన భూమిని ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి

జిల్లాలోని కొన్ని గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతుందని, దళితులపై దాడులు చేస్తున్నారని.. వీటిని అరికట్టేలా చర్యలు చేసుకోవాలని, దాడులకు పాల్పడిన వారికి స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా జైలుకు పంపించేలా చూడాలని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించామన్నారు. ఎస్సీ, ఎస్టీలు అందరూ కలిసికట్టుగా ఉండి తమ హక్కులను సాధించుకుందామని.. ఎవరికి ఏ ఆపద వచ్చినా సమాచారమిస్తే వచ్చి ఆదుకుంటానని అన్నారు. ఇదిలాఉండగా, కేఎన్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణా, మరికొందరు మాట్లాడుతూ.. సదరు ముడుమాల్ అర్చకుడు 120 ఎకరాలు సాగుచేస్తున్నాడని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంచాలని, బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ఆయన వచ్చే నెల జిల్లాకు వస్తానని దళితులకు ఎంత వరకు న్యాయం జరిగింది ఆరా తీయడంతోపాటు, దాడికి పాల్పడిన కేసుల వివరాలు తెలుసుకొని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సదరు అర్చకుడిపై 420 కేసు నమోదు చేయాలని, ఎస్సీ,ఎస్టీలకు తగిన న్యాయం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యుడు శంకర్, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ జానయ్య, డీఆర్‌డీఓ పీడీ బుచ్చయ్య, సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ ఎండీ నవీద్, దళిత సంఘాల నాయకులు, పి.వంకర్, చంద్రశేఖర్, పృథ్వి, నగేష్,కత్రెప్ప, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిదారులపై కొరడా



శ్రీనివాసకాలనీలోని ఓ దుకాణాన్ని సీజ్ చేయిస్తున్న ఆర్ఐ రమేష్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోవడంతో మున్సిపల్ అధికారులు తాజాగా కొరడా ఝుళిపించారు. ఏకకాలంలో మూడు బృందాలు వివిధ షాపుల నుంచి రూ.8,48,379 వసూలు చేశాయి. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ జె.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రీనివాసకాలనీ మొదలుకుని ఏనుగొండ వరకు మెయిన్ రోడ్డుపై ఉన్న సుమారు 15 షాపులపై మెరుపుదాడులు నిర్వహించారు. అలాగే మరో బృందం క్లాక్ టవర్ సమీపంలోని 45 దుకాణాలను తనిఖీ చేసింది. రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ దుకాణం నుంచి రూ.67,763 నగదుతో పాటు ఇదే ప్రాంతంలోని ఫోర్స్ ట్రాక్టర్లు, తుఫాన్ బస్సులు, జీపుల డీలర్ నుంచి రూ.1,10,616 చెక్కు వసూలు చేశారు. ఏనుగొండలోని ఆర్‌కే కార్ లాంగ్, ఇన్ఫినిటీ షోరూం నిర్వాహకుల నుంచి రూ.1,23,731 రావాల్సి ఉండగా చెల్లించకపోవడంతో రెండు షాపులను సీజ్ చేశారు. ఇక క్లాక్ టవర్ వద్ద ఉన్న ఆరు దుకాణ యజమానుల నుంచి ఆస్తిపన్ను రూ.3,20,000 రాబట్టారు. ఇక మూడో బృందం న్యూటౌన్, షాషాబ్‌గుట్ట ప్రాంతంలోని సుమారు 25 దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు షాపుల నుంచి రూ.3.50 లక్షలు వసూలు చేశారు. ఈ దాడుల్లో ఆర్ఓ మహ్మద్ ఖాజా, ఆర్ఐలు రమేష్, అహ్మద్‌షరీఫ్, ముజీబుద్దీన్, పెంటయ్యతో పాటు బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

క్రిస్టియన్ల సంక్షేమానికి సహకరించాలి



అచ్చంపేట: నియోకవర్గంలోని 45వేల క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఇండియన్ క్రిస్టియన్ జేఏసీ జాతీయ చైర్మన్ బెజవాడ రవి కోరారు. గురువారం అచ్చంపేట ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు అన్ని సామాజిక వర్గాలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను క్రిస్టియన్ మైనార్టీలకు అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా కానీ, నామినేటెడ్ పదవుల్లో క్రిస్టియన్లకు ప్రాధాన్యత లభించలేదని వాపోయారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చొరవ తీసుకొని కమ్యూనిటీ భవనం, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐపీసీ చర్చి పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.జాన్ సుందర్‌రావు, వెంకటయ్య, జేఏసీ చైర్మన్ జాన్‌పాల్, బైయన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌తో ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న బాధితులు

- ప్లాట్లను తిరిగి వ్యవసాయ భూమిగా మార్చి విక్రయం
- న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

కల్వకుర్తి టౌన్: వ్యవసాయ భూమిని నాలా కన్వర్షన్ చేసి, తిరిగి దానిని రద్దు చేసి వ్యవసాయ భూమిగా మార్చి విక్రయించారని బాధితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పట్టణంలోని సాయిబాలాజీ ఫంక్షన్ హాల్ వద్ద సర్వే నం.736/1లో 1.19 ఎకరాల భూమిని చారకొండ మండలం జూపల్లికి చెందిన పెద్దయ్యయాదవ్ అనే వ్యక్తి 2008లో సదరు భూమిని నాలా కన్వర్షన్ చేసి ప్లాట్లుగా మార్చాడు. ఈ క్రమంలో దగ్గరి బంధువులకు 21 ప్లాట్లను అమ్మేశాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి క్రయవిక్రయాలు కాకపోవటంతో అతను అదే అదునుగా భావించి.. అప్పటి నాలా కన్వర్షన్‌ను మార్చి తిరిగి వ్యవసాయ భూమిగా రికార్డులలో ఎక్కించాడు. ఈ క్రమంలో ఆగస్టులో ధరణిలో వ్యవసాయ భూమిగా ఉండటంతో సూగూరి సాయికిరణ్ అనే వ్యక్తికి 1.19 ఎకరాల భూమిని గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేశాడు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత అతను సైతం భూమిని చూయించాలని యజమానికి తెలిపారు.

చదును చేయడంతో వెలుగులోకి..

భూమిని అమ్మిన యజమాని సదరు భూమిని అమ్మిన వ్యక్తికి చూయించేందుకు చదును చేస్తున్నాడు. ఈ సమయంలో అక్కడ ఉన్నవారు ఆ సర్వే నంబర్‌లో ఉన్న యజమానులకు చెప్పారు. దీంతో వారంతా అక్కడికి వచ్చి అడగగా.. ప్లాట్ల రాళ్లను తిరిగి పాతడానికి అని చెప్పడంతో నిజమేనని వెళ్లిపోయారు. మరోసారి రెండు రోజుల కిందట చుట్టూ కడీలతో ఫెన్సింగ్ వేసేందుకు ప్రయత్నించగా మరోసారి వచ్చి నిలదీయడంతో డొంక తిరుగుడు సమాధానాలు చెబుతూ అక్కడ నుంచి పెద్దయ్యయాదవ్ వెళ్లిపోయాడని బాధితులు ఆరోపించారు. ఈ విషయం తెలియడంతో బాధితులలో కొందరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆరాతీయగా వేరేవాళ్లకు సదరు భూమి రిజిస్ట్రేషన్ అయ్యిందని చెప్పడంతో అవాక్కయ్యారు. దీంతో డబుల్ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని, సదరు సర్వే నంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బంధువని నమ్మి కొన్నాం



2008లోనే మా బంధువు వెంచర్ చేశానని చెప్పడంతో సుమారు 400 గజాల వరకు ప్లాటు కొన్నాను. అలాగే మా బంధువులతో చెప్పి ప్లాట్లను వారికి సైతం ఇప్పించాను. ఇప్పుడు అక్కడికి వెళ్లి చూస్తే వెంచర్‌లో రాళ్లు లేకుండా, కంచెతో తీగ చుట్టి ఉంది. ఇదేమిటని అతనిని అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. ఫోన్ చేస్తే ఎత్తడం లేదు. మాకు న్యాయం జరిగే వరకు నిరసన చేపడతాం.

– ఈదయ్య,
బాధితుడు, ఇదంపల్లి

సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి

మహమ్మదాబాద్: సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు గిరిజారెడ్డి, కొండమ్మ, నిర్మల, కవిత, శోభ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి సురేష్